## "రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి"పై స్వల్ప వ్యవధి చర్చకు సంబంధించి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చేయు వివరణ

మహాశయా,

ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పరిస్థితి మొత్తం మీద ప్రశాంతంగా ఉన్నది. పోలీసు శాఖ నిరంతరంగా పర్యవేక్షిస్తున్నది. సి.పి.ఐ. మావోయిస్టు, ఉగ్రవాద సంస్థలు, నేర సంస్థల కార్యకలాపాల పై నిరంతరం నిఘా ఉంచుతూ, వాటిని నియంత్రించడానికి కట్టుదిట్టమైన, సమర్ధవంతమైన చర్యలను తీసుకోవడమవుతున్నది.

**తీవ్రవాద కార్యకలాపాలు :**

రెండు పదునైన వ్యూహాలు అంటే అభివృద్ధి వ్యూహం, క్రియాశీలక పోలీసింగ్ ద్వారా మావోయిస్టుల కార్యకలాపాలను పటిష్టంగా ఎదుర్కోటానికి దేశంలోనే మార్గదర్శిగా కొనసాగడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించిన ఈ వ్యూహాలు అనేక అద్భుతమైన ఫలితాలనిచ్చి, 13 జిల్లాలలోని ఎక్కువ భాగంలో నక్సలైట్ల కార్యకలాపాలు తగ్గాయి. విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలలో నక్సలైట్ల కార్యకలాపాలపై గట్టి నిఘా కొనసాగుతుంది. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితి, దట్టమైన అడవులు అనుకూల వాతావరణ పరిస్థితులు, ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సాలలో తీవ్రంగా ప్రభావితమయిన జిల్లాలతో సుధీర్ఘ సరిహద్దులు కలిగి ఉండటం కారణంగా, నేటికి కూడా ఈ రెండు జిల్లాలలో దుర్బల పరిస్థితి కొనసాగుతున్నది. మావోయిస్టులలో ఎక్కువ మంది చొరబడి, నేరాలకు పాల్పడి, ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా రాష్ట్రాలలోకి పారిపోవడం వంటి గెరిల్లా ఎత్తుగడలను అనుసరిస్తున్నారు.

1995 నుండి వివిధ ప్రభుత్వాలు అనుసరించిన విధానంలో నిలకడ కారణంగా, మావోయిస్టుల నేరాలలో తగ్గుదల నిలకడగా ఉన్నది. అడవులలో మావోయిస్టులను ఎదుర్కోవడంలో గ్రేహౌండ్స్ వంటి కమాండో బలగాల ద్వారా కఠిన ఎత్తుగడల పోలీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధానం, క్రియాశీల అభివృద్ధి, అదే విధంగా సంక్షేమ చర్యలు, మావోయిస్టులలో యువత చేరకుండా నిరంతరంగా దూరంగా ఉంచింది. ప్రస్తుతం వారు ఉపాధికల్పన అవకాశాలు, అభివృద్ధికోసం ప్రజాస్వామ్యంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాల నుండి

ఎదురుచూస్తున్నారు. 2013లో 4 హత్యలతో సహా 18 నేరాలకు పాల్పడగా, 2014 సంవత్సరంలో ఒక హత్యతో కలుపుకొని ఆరు నేరాలకు పాల్పడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 83 అజ్ఞాతంలో వున్న కేడరులు ఉన్నాయని, అందులో 61 మంది ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కాగా మిగిలిన కేడరు ఛత్తీస్‌ఘడ్, ఇతర రాష్ట్రాల నుండి కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని పోలీసు నివేదికలు తెలియజేసాయి.

అజ్ఞాతంలో ఉన్న సాయుధ క్యాడర్, ఆయుధాలు వదలడానికి, మారుమూల తీవ్రవాదం బారిన పడిన ప్రాంతాలను ఉధారంగా అభివృద్ధి చేస్తూ, సామాన్య మానవుని ముంగిటకు సంక్షేమ చర్యలను తీసుకెళ్ళే రెండు పదునైన వ్యూహాలను కొనసాగించాలని ప్రభుత్వం ప్రతినభూనింది. ప్రభుత్వం మారుమూల ప్రభావిత ప్రాంతాలలోని ప్రజల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర నిధులను కేటాయించి, ఖర్చు చేయడాన్ని ప్రభుత్వం కొనసాగించాలని కూడా ప్రతిపాదిస్తున్నది. మావోయిస్టుల లొంగుబాటు, పునరావాసం, సామాజిక పోలీసింగ్‌ను ప్రోత్సహించడాన్ని, నక్సలిజంలో చేరడంలో గల నిరర్థకతకు సంబంధించి సామాన్యునికి, యువతకు అవగాహన కల్పించడాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుంది.

<u>మతతత్వ దృశ్య వివరణ:-</u>

రాష్ట్రంలో మతతత్వం పరిస్థితి ప్రశాంతంగా ఉంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పవిత్ర రంజాన్ మాసం శాంతియుతంగా ముగిసింది. ప్రభుత్వం మైనారిటీ వర్గాల సంక్షేమాన్ని క్రియాశీలకంగా చేపట్టి, ప్రతి ఒక్కరికి సమన్యాయం జరిగేలా చూస్తుంది.

<u>ఉగ్రవాద కార్యకలాపాలు:-</u>

5-10-2013 తేదీన పుత్తూరు వద్ద అల్-ఉమ్మా కేడర్ అరెస్ట్ మినహా రాష్ట్రంలో ఎటువంటి స్పష్టమైన ఉగ్రవాద కార్యకలాపం లేదు. ఏమైనప్పటికీ, పోలీసుశాఖ నిరంతరాయ నిఘాను కొనసాగిస్తున్నది. రాష్ట్రానికిగల పొడవైన కోస్తా తీరాన్ని దృష్టిలో పెట్టుకొని, అంతరిక్ష, రక్షణ, అణు, ఆయిల్ క్షేత్ర స్థాపనలు వంటి ముఖ్యమైన అన్ని స్థాపనల కోసం భద్రతను పెంచాలని ప్రభుత్వం పోలీసు శాఖను ఆదేశించింది.